సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వైద్యులపై జరుగుతున్న దాడులు చూస్తుంటే భయమేస్తోంది. కోల్‌కతా సంఘటన తరువాత అయినా ప్రభుత్వాల్లో మార్పు రావాలి. ఇక్కడ ఎటువంటి రక్షణా లేదు. అధికారులు స్పందించి పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– టి. అంజలి, ఏఎన్ఎం, పీహెచ్‌సీ, కాపులుప్పాడ

పోలీసులు రక్షణ కల్పించాలి



చేపలుప్పాడ యూపీహెచ్‌సీ దగ్గర గంజాయి బ్యాచ్‌తో, మద్యం సేవించిన ఆకతాయిలతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కిటికీలో నుండి చూడటం, భయపెట్టడం వంటివి చేస్తున్నారు. సరైన రక్షణ లేకపోవడంతో డ్యూటీ చేయడానికి కూడా ఇబ్బందికరంగా ఉంటోంది. మహిళా వైద్యుల భద్రతకు పోలీసులు, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కె.వినీత, స్టాఫ్ నర్స్, యూపీహెచ్‌సీ, చేపలుప్పాడ

క్లుప్తంగా

విశేష అలంకరణలో రాస పోలమాంబ



పువ్వులు, జాకెట్ ముక్కల అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం స్థానిక శ్రీ హనుమాన్ సేవా దళ్ మహిళలు జరభరా పువ్వులు, జాకెట్ ముక్కలతో అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణతో ఉన్న అమ్మవారిని పలువురు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఇదే గ్రామానికి చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



సేవానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గాయత్రి మెడికల్ కళాశాల విద్యార్థులు

తగరపువలస: గాయత్రి మెడికల్ కళాశాల విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది, సేవానగర్ హౌసింగ్‌బోర్డు కాలనీ 36వ వార్డు సచివాలయం పరిధిలో మంగళవారం ర్యాలీ నిర్వహించిన వారు, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రచారం చేశారు. అనంతరం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ రవికిరణ్, ఎం.ఎస్.రాజు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.88 వేల జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 16 మందికి న్యాయస్థానం 88వేల జరిమానా విధించింది. పీఎం పాలెం ట్రాఫిక్ ఆర్ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 16 మందిని గుర్తించి, కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. 5 వేల నుంచి రూ.7 వేల వంతున మొత్తం రూ.88 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఆర్ఎస్ఐ తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ చిన్నయ్యపాలెం మామిడితోటలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం అవశేషాలు కనిపించాయి. స్థానికులు ఎండుకర్రల కోసం వెళ్లగా ఈ మృతదేహం కనిపించింది. దీంతో ఆనందపురం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ సంతోష్ క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్తు పట్టలేని విధంగా మృతదేహం శిథిలం కావడంతో చనిపోయి రెండు వారాలు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతుని అవశేషాలు లభించిన చోటు నిర్మానుష్య ప్రాంతం కావడంతో హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

తుపాను రక్షిత భవనానికి రక్షణ కరువు



భవనంలో ఊడిపోయిన తలుపు

తగరపువలస: ఒకటో వార్డు రామన్నపేటలోని తుపాను రక్షిత భవనానికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తుండగా, ఫస్ట్ ఫ్లోర్ ఖాళీగా ఉంది. ఇక్కడికి చేరుకునే మార్గంలో తలుపు ఊడిపోయినందున ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. తుపాను రక్షిత భవనానికి చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేసి షెడ్లు నిర్మించుకున్నారు. అధికారులు స్పందించి, భవనానికి మరమ్మతులు చేపట్టాలని, ఆక్రమణలకు తావు లేకుండా ఫెన్సింగ్ నిర్మించాలని రామన్నపేట వాసులు కోరుతున్నారు.

నిలిచిన రోడ్డు విస్తరణ

- గోతులమయంగా రహదారి
- ప్రయాణం నరకప్రాయం
- ప్రయాణికుల అవస్థలు



యాతపేటకు సమీపంలో రోడ్డు ఇలా..



శేరిఖండంలో గోతులమయమైన రోడ్డు



రెడ్డిపల్లిలో వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న రోడ్డు

పద్మనాభం: గతుకులమయమైన రహదారి విస్తరణకు నిధులు మంజూరైనా పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయనగరం – శొంఠ్యాం ఆర్‌అండ్‌ బీ రోడ్డు రెడ్డిపల్లి – శేరిఖండం గ్రామాల్లో రాకపోకలు సాగించడానికి నరక యాతన పడుతున్నారు. వివరాలివి..

శేరిఖండం పుప్పాల అప్పలకృష్ణ ఇంటి నుంచి రెడ్డిపల్లి కోమటి గుండం మలుపు వరకు సుమారు కిలోమీటరు నిడివిలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు గోతులు పడింది. 12 అడుగుల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 40 అడుగులకు విస్తరించడంతో పాటు అభివృద్ధి చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు రూ.10.04 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు విస్తరణతో పాటు కాలువలు నిర్మించడానికి, కల్వర్టుల ఏర్పాటుకు, సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఈ నిధులు మంజూరు చేశారు. రోడ్డు విస్తరణ కోసం రెడ్డిపల్లిలో రోడ్డుకిరువైపులా ఇళ్లు, షాపులను గతేడాది మార్చిలో తొలగించారు. శేరిఖండం వద్ద పాత కల్వర్టు స్థానంలో కొత్తది నిర్మించారు. చేరిఖండంతో వాడపల్లి వారి ఇళ్ల నుంచి పల్లా వారి ఇంటి వరకు ఒక పక్క సిమెండు రోడ్డు నిర్మించేందుకు ఒక లేయర్ వేశారు. ఇప్పుడు వర్షాలకు అది కూడా దెబ్బతింది. ఆ ప్రాంతం కూడా గతుకులమయంగా తయారైంది. ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గతుకులమయంగా ఉండడంతో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాలు పాలవుతున్నారు. గోతుల వద్ద ద్విచక్ర వాహనచోదకులు వాహనంపై నుంచి ఎగిరి పడుతున్నారు. రాళ్లు తేలిపోవడంతో వాహనాలు పంక్చర్లు అవుతున్నాయి.

వానొస్తే చెరువే..

వర్షం కురిస్తే రెడ్డిపల్లిలో కోమటి గుండం చెరువు, యాతపేట, అంబేడ్కర్ బొమ్మ సమీపంలో రోడ్డు చెరువును తలపిస్తోంది. రోడ్డు జలమయం కావడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి పడే పాట్లు వర్ణనాతీతం. రోజురోజుకు రోడ్డు మరింత అధ్వానంగా తయారవుతోంది. బస్సులు, లారీల వంటి వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము, దూళి ఎగిరి ప్రయాణికుల కళ్లలో పడడంతో ఇబ్బంది పడుతున్నారు.

దెబ్బతిన్న పైపులైను

రోడ్డు విస్తరణ కోసం పొక్లెయిన్‌తో తవ్వడం వల్ల ఇంటింటి కుళాయిల పైపు లైను పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో రెడ్డిపల్లిలో 250, చేరిఖండంలో 40 కుళాయిల నుంచి ఏడాదిన్నరగా చుక్క నీరు రావడంలేదు. దీంతో ప్రజలు తాగు నీటికి అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీలు మూసుకుపోడంతో మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చేస్తోంది. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు ఆగిపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని, త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

గతుకుల రోడ్డుతో అవస్థలు



రోడ్డు పూర్తిగా గోతులు పడడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. పిక్కలు తేలిపోవడంతో వాహనాలు పంక్చర్ అవుతున్నాయి. లారీలు, బస్సుల వంటి వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి రేగి కళ్లలో పడుతోంది. అధికారులు త్వరితగతిన రోడ్డు విస్తరణ పూర్తి చేయాలి.

– ఎస్.సూర్యనారాయణ, రెడ్డిపల్లి

చెరువును తలపిస్తున్న రోడ్డు



వర్షం కురిస్తే రోడ్డు చెరువులా ఉంటోంది. ఆ సమయంలో గోతులు కనిపించక ప్రమాదాలబారిన పడుతున్నాం. కోమటి గుండం చెరువు, అంబేడ్కర్ బొమ్మ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండిపోతోంది. వర్షం కురిస్తే నీరు వారం రోజుల వరకు నిల్వ ఉండిపోవడంతో నడిచే వెళ్లడానికి కూడా కష్టమవుతోంది. రోడ్డు బాగు చేయాలి.

– ఎస్.శంకర్, రెడ్డిపల్లి

నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తాం

రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. నెలాఖరులోగా పనులను ప్రారంభిస్తాం. త్వరిత గతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– గంగరాజు, ఆర్ అండ్ బీ డీఈ

ఒకటి నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనం



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రంలో సెప్టెంబరు 1 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు గుజ్జు రామునాయుడు భవన్‌లో నాయకులు మంగళవారం పోస్టర్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేస్తూ కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తూ స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండపు ఈశ్వరరావు, అల్లు బాబూరావు, మావూరి సన్యాసమ్మ, చిల్ల అప్పలసూరి, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వసూలు వేలం రేపటికి వాయిదా

భీమునిపట్నం: భీమిలి మూడో వార్డులో ఆశీలు వసూలుకు సంబంధించిన వేలం పాటలు 29వ తేదీకి వాయిదావేసినట్లు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. మంగళవారం జరగవలసిన వేలం పాటలకు ఎవరూ రానందున వాయిదా వేసినట్టు చెప్పారు. ఇక్కడ రోడ్డు మార్జిన్, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు, లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్ మొదలైన వాటిల్లో ఆశీలు వసూలు చేసుకోవడానికి, బీచ్ సమీపంలో షాపుల నిర్వహణకు వేలం జరుగుతుందని, ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

15 అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు

ఆర్థిక సంఘం నిధులు మంజూరు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలో 15 అభివృద్ధి పనులు చేపట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలు మంజూరైనట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెడ్డిపల్లి, కోరాడ, మద్ది పంచాయతీ తునిపాలెం, అనంతవరం, గంధవరం, పొట్నూరు, తునివలస, పాండ్రంగి, ఐనాడ గ్రామాల్లో ఒక్కో బోరు బావి నిర్మించడానికి ఒక్కొక్క దానికి రూ.1.05లక్షలు, తునివలసలో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి రూ.2 లక్షలు, పద్మనాభంలో పద్మనాభం జంక్షన్ నుంచి సచివాలయం వరకు సీసీ డ్రైనేజీల నిర్మాణానికి రూ.3లక్షలు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి రెడ్డిపల్లి వారి కళ్లాల వరకు సీసీ డ్రైనేజీలు నిర్మించేందుకు రూ.2.50లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే రేవిడిలో సీసీ డ్రైనేజీలు నిర్మించేందుకు రూ.3లక్షలు, అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ సమావేశ మందిరం నిర్మాణాన్ని పూర్తి చేయటకు రూ.5లక్షలు, రెడ్డిపల్లిలో కమ్యూనిటీ హాల్‌కు తలుపులు, కిటికీలు ఏర్పాటు చేసేందుకు, విద్యుత్ సౌకర్యం కల్పించడానికి రూ.5లక్షలు మంజూరైనట్టు తెలియజేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

92 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మద్ది గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు 92 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సందర్శించారు. వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో రోగులకు బీపీ, షుగర్, జ్వరం పరీక్షలు చేశారు. ముందుగా మద్ది, తునిపాలెం గ్రామాల్లో 650 ఇళ్లల్లో 1950 మందికి జ్వరాల గుర్తింపునకు రేవిడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. ఎంపీపీ విజ్ఞప్తి మేరకు ఈ సర్వే చేశారు. సూపర్‌వైజర్ గోపాలకృష్ణ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ సూర్యారావు పాల్గొన్నారు.

ఒకటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



రేఖవానిపాలెంలో సమావేశమైన భీమిలి బీజేపీ నాయకులు

తగరపువలస: సెప్టెంబరు ఒకటి నుంచి భీమిలి మండలంలో ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని ఆ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి అడుసుమిల్లి కేశవకాంత్ కోరారు. భీమిలి మండలం రేఖవానిపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు కాళ్ల కాసులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణ, క్రియాశీలక సభ్యత్వాల గురించి వివరించారు. నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రేఖ కరుణారావు, నాయకులు పాల్గొన్నారు.

భీమిలిలో..

భీమునిపట్నం: స్థానిక బీజేపీ కార్యాలయంలో మూడు, నాలుగు వార్డులకు సంబంధించిన నాయకులతో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు సమావేశమయ్యారు. ఈ రెండు వార్డుల్లో ఎనిమిది వేలమందిని సభ్యులుగా చేర్పించడానికి లక్ష్యంగా చేసుకుని పని చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు కంటుబోతు సునీత, పోలుబోతు విజయ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

- 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ
- ఏపీఎస్‌పీ శిక్షణ కేంద్రంలో 'దర్బారు'



మాట్లాడుతున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిబంధనల మేరకు కృషి చేస్తామని 16వ బెటాలియన్ కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ అన్నారు. జీవీఎంసీ ఆరో వార్డు బక్కన్నపాలెంలోని ఏపీఎస్‌పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన దర్బారులో ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమాండెంట్‌కు వివరించారు. బెటాలియన్ పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు పి.దేవానందరావు, పి.సత్యం, వి.నారాయణ, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

మనోవ్యథతో మహిళ ఆత్మహత్య

పీఎం పాలెం: అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె, కుమారుడు చిన్నవయసులోనే మరణించడంతో, తట్టుకోలేని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడ్డారు. చంద్రంపాలెంలో మంగళవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. చంద్రంపాలెంలో నివసిస్తున్న నీలపు అప్పారావుకు నలుగురు కుమార్తెలు కాగా.. రెండో కుమార్తె అన్నపూర్ణ (37)ను ఆర్టీసీ ఉద్యోగి అయిన తన మేనల్లుడు బోర స్వామికి ఇచ్చి వివాహం చేశారు. వారికి పూజిత (14), నిఖిల్(12) ఇద్దరూ సంతానం. అనారోగ్యం కారణంగా ఇద్దరూ ఇటీవల మరణించడంతో వారి తల్లి అన్నపూర్ణ తీవ్ర మనోవ్యథకు గురయ్యారు. మంగళవారం సాయంత్రం భర్త డ్యూటీకి వెళ్లిపోగా చున్నీతో ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డారు. అన్నపూర్ణ తండ్రి గమనించి, అల్లుడికి సమాచారం అందించారు. వెంటనే ఇంటికి వచ్చిన స్వామి, ఆమెను కిందికి దించగా, అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న ప్రభూజీ



విశేష అలంకరణలో రాధాకృష్ణులు



ఉత్సాహంగా ఉట్టి సంబరం నిర్వహిస్తున్న బాలురు

- ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు
- హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో వ్యాసపూజ, నందోత్సవం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ముందుగా రాధాకృష్ణులను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ కృష్ణుని లీలపై ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ప్రవచనాలు చేశారు. మందిర ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టి సంబరం ఉత్సాహంగా సాగింది. ఉత్సవాల్లో సుమారు 4వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాతాజీ నితాయి సేవిని పాల్గొన్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో వ్యాసపూజ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ వద్ద హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వ్యాసపూజ(గురుపూజ), నందోత్సవాలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. కృష్ణాష్టమి మరుసటి రోజు తనకు కుమారుడు జన్మించినట్లు నంద మహారాజు ప్రకటించిన దానికి గుర్తుగా ఈ నందోత్సవం నిర్వహించినట్లు అంబరీష దాస తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక గురువు భక్తి వేదాంత స్వామి ప్రభుపాద 128వ జయంతి సందర్భంగా గురుపూజ నిర్వహించారు. ప్రభుపాదకు పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. హారతి అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆన్‌లైన్ కోర్సుల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



ప్రవల్లిక



దీపిక

భీమునిపట్నం: భీమిలి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఇన్ఫోసిస్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారంలో ప్రతిభను కనబరిచారు. కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న చప్పగడ్డ దీపిక, పదో తరగతి చదువుతున్న బండారు ప్రవల్లిక ఇన్ఫోసిస్ టైం మేనేజ్‌మెంట్ కోర్సులైన సాఫ్ట్‌వేర్, డ్రోన్, రోబోటిక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ డేటా తదితర కోర్సులను ఆన్‌లైన్‌లో చేసి సర్టిఫికెట్లు పొందారు. వారిని జిల్లా సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. ఈ విధంగా ఆన్‌లైన్‌లో కోర్సులు చేసిన వారికి భవిష్యత్తులో చక్కని అవకాశాలు వస్తాయని, వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన విద్యార్థులు రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందిన చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు కె. మైథిలి, వై.హారికలను కలెక్టర్ ఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి, ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల స్పెషల్ ఎడ్యుకేటర్‌ను కలెక్టర్ అభినందించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ఏపీవో బి.అప్పలనాయుడు, డైట్‌కు చెందిన మాణిక్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.